క్లుప్తంగా

ఓటు వేసేందుకు ఉద్యోగుల అవస్థలు

సాలూరు: ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం కారణంగా పలువురు ఉద్యోగులు మండుటెండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. సాలూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధి మెంటాడ మండలంలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కోసం పేర్లు నమోదు చేసుకున్నారు. వారికి విజయనగరం జిల్లా జేఎన్‌టీయూ కళాశాలలో ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు అవకాశం కల్పించారు. దీంతో వారంతా అక్కడకు వెళ్లగా.. ఇక్కడ కాదు పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌కు వెళ్లాలని అక్కడివారు చెప్పడంతో ఉద్యోగులు అవాక్కయ్యారు. మండుటెండలో సుమారు 60 కిలోమీటర్ల దూరం తిరుగు ప్రయాణం చేసి సాలూరులో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడంతో తామంతా మండుటెండలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చిందని ఉద్యోగులు వాపోయారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి



చిలకలపల్లిలో ఫ్లాగ్‌మార్చ్ చేస్తున్న పోలీసులు

బలిజిపేట: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై పాపారావు కోరారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కలిసి సోమవారం ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. గ్రామాల్లో గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించేవారిపై బైండోవర్ కేసులు నమోదు చేయనున్నట్లు చెప్పారు. భద్రతా ఏర్పాట్లపై కేంద్ర బలగాలకు పలు సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

రెండో రోజు 562 ఓట్లు


పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న ఆర్ఓ విష్ణుచరణ్

సాలూరు: నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కొనసాగుతోంది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రంలో సోమవారం 562 మంది ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండురోజుల్లో మొత్తం 1108 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని, 81 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ సరళిని ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ పరిశీలించారు.


ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఉద్యోగులు, సిబ్బంది

దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలోని నాలుగు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ యస్.పెంటన్న ఓ ప్రకటనలో సోమవారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి, ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ గ్రూపుల్లోని సీట్లు భర్తీ చేయనున్నామన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులంతా ఈ నెల 18వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీటీడబ్ల్యూజీయూఆర్‌యూకేయూఎల్‌ఏఎం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత

పాలకొండ: పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద పటిష్ట భద్రత ఏర్పాట్లు చేశారు. సీతంపేట ఐటీడీఏ పీఓ, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి శుభం బన్సల్ పోలింగ్‌ను పర్యవేక్షించారు. ఏజెంట్ ఫారాలు లేకుండా జనసేన అభ్యర్థులు రావడంతో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్వల్ప ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో సహాయ ఎన్నికల అధికారి వరహాలు డీఎస్పీ కృష్ణారావుకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీతో పాటు సీఐ చంద్రమౌళి అక్కడకు చేరుకుని ఇరుపార్టీల వారికి సర్దిచెప్పారు. ఏజెంట్ ఫారాలు లేనివారిని అక్కడ నుంచి పంపించారు. ఫారాలు తీసుకుని వచ్చిన తరువాత అనుమతించారు.

పణుకువలసలో.. పోటాపోటీగా అభివృద్ధి, సంక్షేమం

- 426 కుటుంబాలకు గాను 414 కుటుంబాలకు సంక్షేమ ఫలాలు
- రూ.58.65 లక్షలతో అభివృద్ధి పనులు


'నాడు–నేడు'తో రూపురేఖలు మారిన పాఠశాల


పణుకువలస గ్రామం


ఇంటింటికీ వేసిన కుళాయిలు

బలిజిపేట: మండలంలోని పణుకువలస పంచాయతీలో సంక్షేమం, అభివృద్ధి ఒకదానితో ఒకటి పోటీపడుతూ పరుగులు తీస్తున్నాయి. గ్రామంలో రూ.58.65 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయి. పార్టీలకు అతీతంగా, కులమతాలకు తావులేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాయి. గ్రామంలో మొత్తం 426 కుటుంబాలు నివాసం ఉండగా.. అందులో 414 కుటుంబాలకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. గత ప్రభుత్వంలో ఒకరిద్దరికి మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ పథకాలు అందుతున్నాయని గ్రామస్తులు అంటున్నారు. పథకాల కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని, ఎవరికీ లంచాలు ఇవ్వాల్సిన అవసరం రాలేదని చెబుతున్నారు. సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుండడంతో ఎలాంటి అవినీతికి ఆస్కారం లేదు.

పార్టీలకు అతీతంగా..



పణుకువలస గ్రామంలో ఉన్న అందరికీ వారివారి అర్హతలను బట్టి సంక్షేమ పథకాలు వర్తించాయి. గ్రామంలోని అర్హులందరికీ పథకాలు అందేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది కృషిచేశారు. ఎమ్మెల్యే జోగారావు చొరవతో గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టాం. 'నాడు–నేడు' నిధులతో మా ఊరు బడిని బాగుచేసుకున్నాం.
– విజయ, సర్పంచ్, పణుకువలస, బలిజిపేట మండలం

జగనన్న మేలు చేశారు



ఈ ప్రభుత్వంలో పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందాయి. ఎవరి చుట్టూ తిరగలేదు. ఎవరికి ఒక్క పైసా అయినా ఇవ్వలేదు. వలంటీర్లతోనే పథకాలు అమలు జరిగాయి. ఈ ప్రభుత్వంలో మాకు ఎంతో మేలు జరిగింది. ప్రజలకు మేలుచేసే ముఖ్యమంత్రి కావాలి.
– సీహెచ్.స్వర్ణమ్మ, పణుకువలస, బలిజిపేట మండలం

నేరుగా అందాయి



మా ఇంట్లో అర్హత ఉన్న వారందరికీ ప్రభుత్వ పథకాలు అందాయి. పథకాల కోసం అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగలేదు. వలంటీర్లే ఇంటికి వచ్చి దరఖాస్తు చేయించారు. డబ్బులు నేరుగా మా ఖాతాలో జమయ్యాయి. గతంలో పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు పడ్డాం.
– జి.సత్తెమ్మ, పణుకువలస, బలిజిపేట మండలం

అలాగే గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.37 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సమస్య పరిష్కరించారు. రూ.10.35 లక్షలతో సీసీరోడ్లు, కల్వర్టులు నిర్మించారు.


గ్రామంలో వేసిన సీసీ రోడ్డు

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి


తాళ్లబురిడిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు

- కూటమి నేతల మాటలు నమ్మి మోసపోవద్దు
- ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు

పార్వతీపురంటౌన్: సంక్షేమ పాలన అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలవాలని, మే 13న జరగిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు కోరారు. మండలంలోని సుడిగాం, పుట్టూరు, తాళ్లబురిడి, బాలగుడబ గ్రామల్లో సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. అడుగడుగునా ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మాకు మంచి చేసిన జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ తీసుకొచ్చేందుకు మేమంతా సిద్ధమంటూ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ.. జగనన్నను రెండోసారి సీఎంను చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని, మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఏకపక్షంగా ఓటుల వేసి భారీ విజయాన్ని అందించేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా అండగా ఉన్నానని, భవిష్యత్‌లో కూడా తోడుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. అధికారం కోసం కూటమి నాయకులు మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.

రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ తనూజా రాణిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యులు కోయ్యాన శ్రీవాణి, పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్, ఎంపీపీ మజ్జి శోభారాణి, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సుడిగాంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న అలజంగి జోగారావు

ప్రచారంలో దూసుకుపోతున్న 'ఫ్యాన్'


మక్కువ: పనసభద్రలో ప్రచారం నిర్వహిస్తున్న మావుడి సోదరులు

సీతానగరం: ఫ్యాన్ గుర్తుపై ఓటేద్దాం.. సంక్షేమ పాలనను కొనసాగించుకుందామని నినాదాలు చేస్తూ పెద్ద సంఖ్యలో మహిళలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం చేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగనన్నే సీఎం కావాలని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా జోగారావును, ఎంపీగా తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. తామరఖండిలో ఎంపీటీసీ వై.గౌరీశ్వరి, పెదబోగిలి పంచాయతీలో ఎంపీటీసీ ఎస్.గౌరీ, మాజీ సర్పంచ్ ఎల్.లక్ష్మి, రామారావు, తదతరులు ప్రచారం చేశారు. అలాగే సూరంపేటలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎం.స్వామినాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు.

మక్కువ: మండలంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర, ఎంపీ అభ్యర్థి తనూజా రాణికి మద్దతుగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. కవిరిపల్లి పంచాయతీ కవిరివలస, బట్టివలస, పనసభద్ర పంచాయతీ ఆలగురువు, మూలవలస, పనసభద్ర, తదితర గ్రామాల్లో జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మక్కువ సర్పంచ్ ఒంటి రామలక్ష్మి, సచివాలయ కన్వీనర్ కొత్తూరు శంకరరావు, మాజీ వలంటీర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బలిజిపేట: రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాలని మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం కోరారు. మండలంలో బలిజిపేట, బర్లి గ్రామాల్లో సోమవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయని, ప్రతీ పేదవాడికి న్యాయం జరిగిందన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు. కార్యక్రమంలో బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బలిజిపేట: బర్లిలో ప్రచారం చేస్తున్న నాయకులు


మక్కువ: మూలవలసలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గిరిజనులు


సీతానగరం: సూరంపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు


సీతానగరం: తామరఖండిలో ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ వై.గౌరీశ్వరి, మహిళలు


సీతానగరం: కమలతోటలో ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ గౌరి, మాజీ సర్పంచ్ ఎల్.లక్ష్మి, తదితరులు

రాజన్నకు అడుగడుగునా జన నీరాజనం

- బ్రహ్మరథం పట్టిన గిరిజన గ్రామాల ప్రజలు
- కూటమి మోసాలను తిప్పికొట్టాలని ప్రజలకు పిలుపు

సాలూరు రూరల్: మండలంలోని కొట్టుపరువు, పగులుచెన్నూరు, పట్టుచెన్నూరు పంచాయతీలతో పాటు పలు గ్రామాల్లో డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర సోమవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు, అభిమానులు అడుగడుగునా పూలమాలలు వేసి నీరాజనాలు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబుతో పాటు ఆ పార్టీ నేతలంతా అబద్ధాలు, అసత్యాలను ప్రచారం చేస్తూ ఎన్నికల్లో లబ్ధిపొందాలని చూస్తున్నారని విమర్శించారు. మా నాయకుడిలా 'మీకు మేలు జరిగితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయండని' అడిగే ధైర్యం టీడీపీ నాయకులకు ఉందా అని ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో రైతులు, డ్వాక్రా మహిళల రుణాలు మాఫీతో పాటు 600 హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక హామీలు అమలు చేయకుండా ప్రజలు మోసం చేశారని మండిపడ్డారు. ఇప్పుడు మళ్లీ అవే అబద్ధాలతో 'సూపర్ సిక్స్' అంటూ ప్రజలను మోసం చేసేందుకు మరోసారి మీ మధ్యకు వస్తున్నారని, అటువంటి వారిని తరిమికొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.


వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజన్నదొరకు పూలమాలలతో స్వాగతం పలుకుతున్న మెండంగి గ్రామస్తులు


మాట్లాడుతున్న పీడిక రాజన్నదొర

గిరిజన మహిళలతో రాజన్నదొర ధింసా నృత్యం

గిరిజన గ్రామాల్లో ఇంటింటి ప్రచారంలో భాగంగా గిరిజన మహిళలతో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ధింసా నృత్యం చేసి పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహం నింపారు. మరిపల్లి గ్రామంలో రాజన్నదొరకు మేళతాళాలతో స్వాగతం పలికారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ తనూజారాణిని గెలిపించాలని కోరారు.

ప్రచార ర్యాలీలో మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కన్వీనర్ దండి శ్రీను, సర్పంచ్ మువ్వల ఆదయ్య, గిరిజన నాయకుడు కొండగొర్రి ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజన్నదొర


గిరిజన మహిళలతో రాజన్నదొర

ప్రారంభమైన హోం ఓటింగ్

సీతానగరం: ఓటు హక్కు కలిగి 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 80 శాతంపైగా దివ్యాంగత్వం కలిగిన వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారంతా ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ మేరకు మండలంలో సోమవారం నుంచి హోం ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లా, నియోజకవర్గ ఎన్నికల అధికారుల సూచనల మేరకు సోమవారం కృష్ణారాయపురం, ఆవాలవలస, బూర్జ, వెంకటాపురం, గుచ్చిమి, పాపమ్మవలస గ్రామాల్లో హోం ఓటింగ్ బృందాలు పర్యటించి హోం పోలింగ్ నిర్వహించారు. ముందుగా నమోదు చేసుకు ఓటర్లు పీఓ, ఏపీఓ, సెక్టోరల్ అధికారి, మైక్రో అబ్జర్వర్, వీడియోగ్రాఫర్ సమక్షంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బుధవారం వరకు హోం ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.


ఆవాలవలసలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న దివ్యాంగుడు


కృష్ణారాయపురంలో ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్ధుడు బి.అప్పలస్వామి

ఎన్నికల సరళిపై ఆరా

పాలకొండ: పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి ఆరా తీశారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రం వద్దకు సోమవారం చేరుకుని ఏజెంట్లతో మాట్లాడారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌ఓను కోరారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటర్లను కోరారు.